# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

**రేఖతో లీసా అన్నది,** "రేపు డెబ్బీ పుట్టినరోజు. ఇక్కడే ఒక మెక్సికన్ రెస్టారెంటులో రేపు రాత్రి డిన్నర్. నువ్వు కూడా రావాలి"

"నేనా... ఎందుకులే" అన్నది రేఖ.

"డెబ్బీకి తెలిసిన వాళ్లు కూడా ఎక్కువమంది లేరు. ఫరవాలేదులే రా. నేను డ్రైవ్ చేస్తానుగా. అసలే స్ట్రెస్లో వున్నావు, నీకూ కొంత విశ్రాంతిగా బాగుంటుంది. త్వరగానే వచ్చేద్దాం" అంది.

రేఖకి ఇక సరే అనక తప్పలేదు.

లీసా, డెబ్బీ అక్కడికి వెళ్ళేసరికీ అక్కడ డెబ్బీతో పాటు ఇంకో ఇద్దరు కూర్చునివున్నారు. డెబ్బీ బాస్ నిక్, డెబ్బీ స్నేహితురాలు షెర్లీ. షెర్లీ ఇంతకుముందు డెబ్బీ పనిచేసిన కంపెనీలోనే పనిచేస్తున్నది.

లీసా తనూ ఒకే ఎపార్ట్మెంట్లో వుంటామనీ, లీసా రేఖా ఒకే కంపెనీలో పనిచేస్తున్నారనీ పరిచయం చేసింది డెబ్బీ.

నిక్ తను కౌన్సిలింగ్ సైకాలజిస్టుగా పరిచయం చేసుకున్నాడు.

ఎవరూ వినకుండా లీసా నెమ్మదిగా రేఖతో అన్నది, 'ఏయ్. నిక్ బాగున్నాడు కదూ" అని.

రేఖ చిరునవు నవ్వింది.

రేఖ మనసులో మాత్రం "ఇతను ఇవ్వబోయే టెస్టిమొనీ తన కేసుకి పనికొస్తే బాగుండును" అని అనుకుంటున్నది.

నిక్ రేఖ గురించి అడిగాడు, ఉద్యోగం ఎక్కడ, ఎలా వుంది మొదలైన ప్రశ్నలు.

రేఖతో మాట్లాడుతుంటే అతనికే కాదు, అతనితో మాట్లాడుతుంటే రేఖకి కూడా బాగుంది.

లీసా ఇద్దర్నీ గమనిస్తూనే వుంది. మధ్యే మధ్యే చిరునవ్వులు కూడా కురిపిస్తున్నది.

ఈమధ్య ఇండియా సంతతి అమ్మాయిలే నాకు ఎక్కువగా పరిచయం అవుతున్నారు అనుకున్నాడు నిక్. అక్కడ ఇంగ్లాండ్లో సమీర. ఇప్పుడు రేఖ, కానీ ఇద్దరినీ ఒకళ్ళతో ఇంకొకళ్ళని పోల్చటం లేదు. ఎవరి తరహా వారిదే. తన ఆలోచనలతో ఇంకొకరిని జడ్జ్ చేయటం సైకాలజిస్టుగా అతనికి ఇష్టం వుండదు.

"మీరు ఇంగ్లాండులో రెండు నెలలు వెకేషన్ మీద వున్నారని చెప్పింది డెబ్బీ. మీకక్కడ ఎవరైనా తెలిసిన వాళ్ళున్నారా? అక్కడ ఏంచేసేవారు" రేఖ అడిగింది.

"నా కజిన్ ఒకడున్నాడు బాబ్ అని. అతనితో లండన్లోనూ, మిగతా వూళ్ళు నా అంతట నేనే, నాకెంతో ఇష్టమైన సాహిత్యకారుల మ్యూసియంలు, పుట్టిన ప్రదేశాలూ చూస్తూ కాలం గడిపేశాను" అంటూనే, తన బర్మింగ్హాం విశేషాలు కూడా చెప్పాడు. సమీర గురించి అతనేమీ చెప్పలేదు. అది ఆ సందర్భంలో అనవసరం అనుకున్నాడు కాబోలు.

రేఖకి అతని సత్యాన్వేషణ కార్యక్రమం గురించి చెబుతుంటే చాల సరదాగా వుంది.

"నాకూ అలాటి విషయాలంటే మొదటినించీ ఎంతో ఇష్టం. వాటి మీద ఎన్నో పుస్తకాలు చదివాను. ఎన్నో యుగాల క్రితం సిద్ధార్థ అనే పుస్తకం చదివాను. హర్మన్ హెస్ వ్రాసింది,. అదే పేరుతో ఆ కథని ఒక సినిమా కూడా తీశారు... " అని రేఖ చెబుతూ, నిక్ ఆశ్చర్యంగా చూస్తున్నాడని గ్రహించి చెప్పటం ఆపింది.

నిక్ "అవును. నాకెంతో ఇష్టమైన పుస్తకం అది. నాలో సత్యాన్వేషణకి అంకురార్పణ చేసిన పుస్తకం అదే. అయితే నేనా మూవీ చూడలేదు. ఆ పుస్తకం ఇంకా నా దగ్గర వుంది" అన్నాడు.

"నాకూ అంతే. దానిలో ఎన్నో మంచి కొటేషన్లు వున్నాయి. 'జీవితంలో మంచిగానీ చెడుగానీ ఏదైనా జరిగితే, దానికి ఒక అర్థాన్నిచ్చి, ఇవ్వవలసిన విలువనిచ్చి నీకు శుభప్రదంగా వుండేటట్లు మార్చుకో!' అంటాడు హెస్. అది నాకు ఎంతో ఇష్టమైన కొటేషన్" రేఖ అంది.

"నీకేమిటి సత్యాన్వేషణకి వున్న అర్హత అనే ప్రశ్నకి  సిద్ధార్థ అంటాడు, 'నేను ఆలోచించగలను, నాకు ఎంతో సహనం వుంది. తెలుసుకోవాలనే కుతూహలం వుంది. దాని కోసం నిద్రాహారాలైనా మానేయగలను' అని. నాకు స్పందన ఇచ్చిన కొటేషన్ అది" అన్నాడు నిక్.

వాళ్ళిద్దరూ అదే విషయం మాట్లాడుకుంటుంటే, లీసా అన్నది "మీరిద్దరూ ఒకరి ఫోన్ నెంబర్ ఇంకొకరు తీసుకుని తర్వాత తీరిగ్గా మాట్లాడుకోండి. ఇది డెబ్బీ బర్త్ డే పార్టీ" అంటుండగానే, అరడజను మంది వైటర్లు 'హాపీ బర్త్ డే టు డెబ్బీ' అంటూ స్పానిష్ భాషలో పాడుతూ, చప్పట్లు కొడుతూ, కేక్ తీసుకువచ్చారు.

డెబ్బీ కేక్ కట్ చేస్తే, లీసా అందరి ప్లేట్లలోనూ కేక్ ముక్కలు పెట్టింది.

తిరిగి వస్తున్నప్పుడు రేఖ అంది, “డెబ్బీ బర్త్ డే పేరు చెప్పుకుని నా రెండేళ్ళ అమెరికా జీవితంలో ఈ రోజు మొట్టమొదటిసారిగా మనసు విప్పి, నిశ్చింతగా హాయిగా గడిపాను. థాంక్స్ డెబ్బీ, లీసా” అని.

పది రోజుల రోజుల తర్వాత లాయర్ కార్సన్ రేఖకి ఫోన్ చేశాడు.

ఆరోజు వాసు–డిపార్ట్మెంటల్ స్టోర్ కేసు కోర్టుకి వచ్చిందనీ, దానిలో నికొలస్ బేకర్ అనే సైకాలజిస్టు సాక్షిగా వచ్చాడనీ చెప్పాడు. ఆయన చేసిన పరీక్షల ప్రకారం వాసుకి ఒక విధమైన మానసిక రుగ్మత, సాడిస్ట్ మెంటాలిటీ ఎక్కువగా వుందనీ, ఆ ఉద్రేకత వల్ల అతనిలో వివేకత లోపిస్తుందనీ, తిరుగుబాటు ప్రవర్తన వేపు దారి తీయిస్తుందనీ, ఒక్కొక్కసారి హింసాత్మక చర్యల దాకా వెడుతుందనీ, అదెంతో ప్రమాదకరమనీ చెప్పాడు. జ్యూరీలో వున్నవారు మిగతా సాక్షులు చెప్పేది కూడా విన్నాక, రేపో ఎల్లుండో జడ్జిమెంట్ రావచ్చు, అది మనకి ఉపయోగపడే అవకాశాలు వున్నాయి అని కూడా చెప్పాడు.

రేఖ ఆ విషయం చెప్పగానే మురళి సంతోషంతో అన్నాడు, “నేను ఇక్కడ నా బిజినెస్ ప్రయాణం పూర్తి చేసుకుని తిరిగివెళ్ళిపోయే లోపల ఆ జడ్జిమెంట్ వస్తే బాగుంటుంది” అని.

## 17

సమీరకి మనసు మనసులో లేదు.

పోయిన రెండు వారాల్లోనూ నిక్ ఫోనుకి కనీసం రెండు మూడుసార్లు పిలిచింది. ఫోను మ్రోగుతూనే వుంది కానీ అతను జవాబివ్వలేదు.

సత్యాన్వేషణ చేస్తూ ఏ ఆశ్రమంలోనో లేదు కదా, మరి పిలవాటనికేం? అంత బిజీగా వున్నాడా?

ఇంగ్లాండులో వున్నప్పుడు ఆశ్రమం అనే సాకు చెప్పి తప్పించుకున్నాడు. ఇప్పుడు ఏం చెబుతాడో!

ఏముంది, ఏదో కథ చెబుతాడు మళ్ళీ. ఇలాటి వారిని నమ్మటం కష్టం అనుకున్నది. మళ్ళీ పిలుద్దామనినుకుని అహం అడ్డం వస్తుంటే, వద్దులే అనుకుని విరమించుకున్నది.

అప్పుడే ఫోన్ మ్రోగింది.

నిక్.

వద్దనుకుంటూనే ఫోన్ తీసుకున్నది.

“సమీ! నువ్వు రెండుసార్లు పిలిచినట్టున్నావు. నువ్వేమో అక్కడ రాత్రి పూట పిలుస్తున్నావు. నాకు ఆ సమయంలో అమెరికాలో ఆఫీసులో ఎంతో బిజీగా వుండే సమయం. అందుకే పిలువలేకపోయాను. ఐయా వెరీ సారీ” అన్నాడు.

“కనీసం ఒక మెసేజ్ పంపిచవచ్చుగదా?” అంది సమీర నిష్ఠూరంగా.

“నాది అసలే కొత్తగా పెట్టిన ప్రాక్టీసు. ఒకపక్క కొత్త ఆఫీసు, ఇద్దరు ఎంప్లాయీలు, తలకుమాలిన ఇన్వెస్ట్మెంట్లూ. ఇంకొక పక్క నా పాత క్లయంట్లతో పలకరింపులూ, మొట్టమొదటి సిట్టింగుకి ఉచిత ఆహ్వానాలూ, మళ్ళీ కొత్త క్లయంట్లని ఆకర్షించటానికి రకరకాల స్ట్రేటజీలతో హడావిడి. అదీకాక నీలాటి మంచి స్నేహితులతో టెక్ట్ మెసేజీల కన్నా, మనసు విప్పి వివరంగా మాట్లాడటమే నాకు ఇష్టం. అందుకే శనివారం దాకా ఎదురు చూసి, ఇవాళ నిన్ను పిలుస్తున్నాను” అన్నాడు నిక్ నవ్వుతూ.

తను అతనితో మాట్లాడటానికి అంతగా ఎదురు చూస్తుంటే, ఇప్పుడు పిలిచి నవ్వుతున్నాడు, ఏం మనిషి అనుకున్నది మనసులో.

కోపంగా వుంది కనుక కొన్ని క్షణాలు మౌనంగా వుంది.

“ఏమిటి కోపం వచ్చిందా? నేను నీకు చెప్పింది పూర్తిగా నిజం. ఇలాటి విషయాల్లో అబద్ధం చెప్పే అవసరం ఏముంటుంది? అదీకాక ఒక కేసులో నేను టెస్టిమోనీ ఇవ్వటానికి వెళ్ళాను. దానికి సిద్ధమవటం కోసం ఇంకా కొన్ని గంటలు గడిపాల్సి వచ్చింది. ఏం చేయను మరి!” అన్నాడు నిక్.

“అప్పుడు ఆశ్రమంలో వున్నప్పుడూ ఇంతే. నీకు నేనంటే ఏమాత్రం గౌరవం, ఇష్టం వున్నట్టు లేవు” అనబోయి, అనకుండా మళ్ళీ మౌనంగానే వుంది.

ఆమె మౌనరాగాలు తనకి అర్థంకాక, “సమీ... సమీరా, లైన్లో వున్నావా? లేదా లైన్ కట్ అయిందా?” అడిగాడు నిక్.

“లేదు. నేను కూడా ఇప్పుడు నీలాగానే చాల బిజీగా వున్నాను. మళ్ళీ ఇంకెప్పుడన్నా కొన్నాళ్ళలో మాట్లాడుకుందాం. బై నిక్” అని ఫోన్ పెట్టేసింది సమీర.

“సమీరకి కోపం వచ్చినట్టుంది” అనుకున్నాడు నిక్ ఫోన్ పెట్టేస్తూ.

కొంచెం సేపాగి సమీర జెస్సికాకి ఫోన్ చేసింది.

“హాయ్ సమీ. నీతో మాట్లాడి వారం రోజులు అయింది. బాగున్నావా. నీ రీసెర్చి పని బాగుందా” అని అడిగింది జెస్సీ.

“బాగానే వుంది” అంటూ మొదలుపెట్టి రకరకాల విషయాల మీద కాసేపు కబుర్లు చెప్పుకున్నాక, సమీర అడిగింది, “ఏమంటున్నాడు మీ నికొలస్ బేకర్” అని.

“ఈమధ్య నువ్వు అతనితో మాట్లాడలేదా?” అడిగింది జెస్సీ.

“కొన్ని మెసేజీలు పెడితే, చివరికి ఈరోజే అతను పిలిచి ఏవేవో కుంటిసాకులు చెప్పాడు. అదో రకం”

జెస్సికా సౌమ్యంగా అంది, "అదికాదు సమీ. నిక్ కొత్తగా ప్రాక్టీసు పెట్టాడు కదా, బాగా బిజీగా వున్నాట్ట. నిక్ అంతకుముందు ఏదో గ్రూపులో పనిచేయటం కన్నా, ఇదే బాగా సమయం తీసుకుంటున్నదన్నాడు. అదీకాక పెద్ద ఇన్వెస్ట్మెంట్ ఒకటి. కొత్త క్లయంట్సు కోసం మార్కెటింగ్ చేయాలి. పాత క్లయంట్సుని మళ్ళీ తన ప్రాక్టీసుకి తెచ్చుకోవాలి. ఇవన్నీ అతనికి కొత్తగా వచ్చిన తలనొప్పులు. ఇలా వీటితో నానా అవస్థలూ పడుతున్నాడుట"

"ఇవన్నీ తను స్వంత ప్రాక్టీసు పెడదామనుకునే సమయంలోనే ఆలోచించుకుని వుండాలి కదూ. మే బి లాక్ ఆఫ్ ప్లానింగ్" అంది సమీర.

"నో, నో. బిజీగా వుంటున్నాననే అన్నాడు కానీ, అతను చేస్తున్నది ఇష్టం లేదు అనలేదు. తన పేషన్ ఏమిటో అతనికి బాగా తెలుసు. మొదటినించీ తనే ఏదో స్వతంత్రంగా చేసుకోవాలని అతని కోరిక. అందుకే ఆ దిశగా అతని ప్రయాణాన్ని ఎంచుకుని, కష్టపడి సాధిస్తున్నాడు" అన్నది జెస్సికా.

"కాకపోతే అతని సత్యాన్వేషణని కాస్త పక్కన పెట్టాలి" అంది వ్యంగ్యంగా సమీర.

చిన్నగా నవ్వింది జెస్సికా. "లేదు అదీ పక్కనే జరుగుతూనే వున్నదిట. ఈమధ్య ఒక అమ్మాయితో పరిచయం అయిందిట. ఇద్దరి ఆలోచనలూ, సరదాలూ కూడా ఆ సత్యాన్వేషణలోనే ఒకటిగానే వున్నాయిట. ఆమెతో తనకిష్టమైన ఆ విషయాలు మాట్లాడుతుంటే రోజూ సాయంత్రాలు సమయం తెలియటం లేదన్నాడు. ఆఁ! అన్నట్టు ఆ అమ్మాయి కూడా నీలాగా ఇండియన్ సంతతి అమ్మాయేనుట"

సమీర ఒక్క క్షణం మాట్లాడలేదు.

"ఇప్పుడు అర్థమయిందిలే అతను నాతో అలా ఎందుకు సరిగ్గా మాట్లాడటం లేదో" అనుకున్నది సమీర మనసులో.

ఆ మధ్యాహ్నం ఎవరో తలుపు కొడితే, ఎవరా అనుకుంటూ తలుపు తీసింది సమీర.

అశోక్ ముఖోపాధ్యాయ్!

"ఒక్క నిమిషం లోపలికి రావచ్చా?" అడిగాడు.

"రండి" అన్నది సమీర.

"మీతో ఒక స్వంత విషయం పంచుకోవాలని ఇలా వచ్చాను. అది మనిద్దరి మధ్యే వుండాలని నా కోరిక. ఇప్పుడే ఎవరికీ చెప్పటం ఇష్టం లేదు" అన్నాడు అశోక్ నెమ్మదిగా.

"ఏమిటి, దేని గురించి చెప్పబోతున్నాడు?" మనసులో అనుకుంటూనే, "చెప్పండి అదేమిటో. అది మన ఇద్దరి మధ్యనే వుంటుంది" అన్నది సమీర.

అశోక్ ఒక్క క్షణం ఆగి సాలోచనగా అన్నాడు.

“నేను ఇక్కడ నా రీసెర్చిని ఆపేసి కలకత్తాకి వెళ్లిపోతున్నాను. రేపు సోమవారం మా ప్రొఫెసరుకి చెప్పి, ఇంకో వారం రోజుల్లో వెళ్ళిపోతాను” అన్నాడు.

ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది సమీర.

“అదేమిటి? మీకెంతో ఇష్టమైన విషయంలో పని చేస్తూ, ఇప్పుడే మొదలుపెట్టి అప్పుడే వెళ్ళిపోతారా? ఇక్కడ ప్రొఫెసరుతో ఏవైనా గొడవలు వచ్చాయా?” అని అడిగింది సమీర.

అశోక్ చిన్నగా నవ్వి, “ఛ! అదేం లేదు. ఇక్కడ మా ప్రొఫెసర్ చాల మంచివాడు. ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నాడు. కాకపోతే నా అంతట నేనే వెళ్ళిపోదామని అనుకుంటున్నాను” అన్నాడు.

“ఎందుకు, కలకత్తా వెళ్ళి మీవాళ్ళు చూపించిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని అక్కడే వుండిపోదామని అనుకుంటున్నారా?” అడిగింది సమీర.

అశోక్ పెద్దగా నవ్వాడు. “కాదు. మా అమ్మ బాగా పెద్దదయిపోతున్నది. ఒక్కత్తే వుంటున్నది. ఆ ఒంటరితనం ఆవిడ ఆరోగ్యాన్ని మానసికంగానేకాక, శారీరకంగా కూడా దెబ్బ తీస్తున్నది. ఆవిడ మా నాన్న పోయినప్పటినించీ ఎన్నడూ నన్నొదిలి వుండలేదు. నేను ఆవిడని వదలి వుండలేకపోతున్నాను. అమ్మతో మాటమాత్రంగా ఇక్కడ నా ప్రాజెక్ట్ అయిపోతున్నది అని అబద్ధం చెబితే ఎంతో సంతోషించింది. నేను ఇక్కడ చేసే రీసెర్చి అక్కడ కూడా పూర్తిచేయగలను. నాకు ఇప్పుడిక్కడ చాల కొత్త పరిచయాలయాయి కదా. అవి నాకెంతో సహాయపడతాయి” అన్నాడు.

“మీ ప్రొఫెసరుతో చెప్పారా మరి?”

“లేదు. ఇన్నాళ్ళుగా ఆ ఆలోచన మనసులో వున్నా, ఈరోజే ఈ నిర్ణయం తీసుకున్నాను. రేపు మా ప్రొఫెసరుకి ఏమీ దాచకుండా, వున్నదున్నట్టుగా నా ఆలోచనలు చెబుతాను. ఆయన అర్థం చేసుకోగలడు” అన్నాడు అశోక్.

సమీర మాట్లాడలేదు. అతన్నే చూస్తున్నది.

“నేను ఆయనతో చెప్పి, ఆయన అంగీకరించే దాకా వేరే ఎవరికీ చెప్పటం నాకు ఇష్టం లేదు. అందుకే మిమ్మల్ని కూడా ఎవరికీ చెప్పవద్దు అని అడిగాను” అన్నాడు.

సమీర తన ఆలోచనల్లో తను వుంటే, అశోక్ ఆమెనే చూస్తూ, అతని ఆలోచనల్లో అతను వున్నాడు.

సమీర ఆ నిశ్శబ్దానికి అంతరాయం కలిగిస్తూ, “అశోక్. మీరంటే ముందు ఒక స్నేహితుడుగా గొప్ప అభిప్రాయం కలగకపోయినా, తర్వాత మీలో వున్న మంచితనాన్ని దగ్గరగా చూసే అవకాశం వచ్చింది. అంతలోనే మీరు మళ్ళీ దూరంగా వెళ్ళిపోతున్నారు. మీ భవిష్యత్తుకు సరిపడే మంచి నిర్ణయం తీసుకుని, మిమ్మల్ని ప్రేమించే మీ అమ్మగారి దగ్గరకు వెళ్ళి, ఆవిడకు ఆ పెద్ద వయసులో అండగా వుండాలని అనుకుంటున్నారు. చాల మంచి నిర్ణయం. మీరేం చేసినా మీకెంతో శుభం కలగాలని మనసారా ఆశిస్తున్నాను” అన్నది.

అశోక్ లేచి ఆమె చేయి పట్టుకుని సుతారంగా నిమురుతూ, "అవును, నా మనసులోని మాటలు మీరే చెప్పినట్టుగా వుంది నాకు. మీ గురించి నా అభిప్రాయాలు కూడా అలాగే వున్నాయి. ఐ టూ మిస్ యు" అన్నాడు.

## 18

కార్సన్ ఆరోజు తన ఆఫీసులో కలవమంటే రేఖ వెంటనే వెళ్ళింది. వెళ్ళేటప్పుడు ఇంటికి వెళ్ళి తండ్రి మురళిని కూడా తీసుకువెళ్ళింది.

ఆయన చాల ఆప్యాయంగా అన్నాడు.

"ఈ కేస్ విషయంలో జరుగుతున్న వివరాలు నీకు ఎప్పటికప్పుడు చెబుతున్నాను. ఇప్పుడు మీ నాన్నగారు కూడా ఇక్కడ వున్నారు కనుక, ఇంకా కొన్ని వివరాలతో మళ్ళీ చెబుతాను. కొన్ని విడాకుల కేసులు, భార్యాభర్తలు ఇద్దరూ సమ్మతిస్తే తప్ప, ఈరోజుల్లో రకరకాల కారణాల వల్ల చాలా సమయం తీసుకుంటున్నాయి. అందులోనూ వాసు వాళ్ళ లాయర్ చాల గట్టివాడు. వాసు నాన్న ఎంత డబ్బైనా ఖర్చుపెట్టగల ధనవంతుడు. విడాకులు ఇవ్వటం వారికెవరికీ ఇష్టం లేదు. కోర్టుకి పోకుండా సెటిల్ చేసుకుంటే నీకు ఎంతో డబ్బు ఆదా అవుతుంది. అందుకే వాళ్ళు నేను కోర్టుకి పోకుండా, బయటే సెటిల్ చేసుకోవటానికి చేసిన ప్రయత్నాలని ప్రతిసారీ విఫలం చేస్తున్నారు."

"దానివల్ల వాళ్ళకేమిటి లాభం?" రేఖ నాన్న మురళి అడిగాడు.

"రేఖా, నీ దగ్గర అంత డబ్బు లేదని వాళ్ళకు తెలుసు. ఎన్నో వాయిదాలు వేసుకుంటూ కోర్టు కేసు నడుస్తుంటే, ఆ ఖర్చులు ఇక భరించలేక మళ్ళీ వాళ్ళ పంజరంలోకి నువ్వు వెడతావని వాళ్ళ ఆశ. అందుకనే ప్రస్తుతం నువ్వు ఆర్థికంగా నీ కూతురిని సరిగ్గా పోషించి పెంచలేవనీ, తన కూతురి క్షేమం, చదువూ, ఆరోగ్యం, భవిష్యత్తూ అన్నీ పెద్ద క్లిష్ట పరిస్థితిలో వున్నాయనీ ఈ విడాకులకు అడ్డం పడుతున్నాడు వాసు. కానీ ఈరోజు ప్రొద్దున జరిగిన మా సంభాషణలు, ఈ కేసుని త్వరగా ముగించే ఆశలని కలిగిస్తున్నాయి" అన్నాడు.

"చెప్పండి" అడిగింది రేఖ ఆతృతగా.

"ఇవాళ కొన్ని శుభవార్తలున్నాయి. ముందుగా వాసు లాయర్ కోర్టు దాకా వెళ్ళవద్దు, బయటే సెటిల్ చేసుకోవటానికి మేము సిద్ధమని చెప్పాడు. విడాకులు వెంటనే ఇస్తారుట, కానీ సుమ మీద వాళ్ళ హక్కులు వదులుకోరుట. ఆలిమొనీ క్రింద నెలనెలాగానీ, ఒకేసారి మొత్తంగాగానీ ఏమీ ఇవ్వరుట. వాటికి నేనేమీ ఒప్పుకోలేదు. రేఖా, నీకు చెప్పానుగా, వాళ్ళు మాటలకు సిద్ధం అని చెప్పిన కొద్ది గంటల్లోనే, వాసుకి ఆ సైకాలజిస్టు ఇచ్చిన టెస్టిమొనీ అడ్డం వచ్చింది. వాసు మీద ఆ కేసు చాల బలంగా వుంది. అతనిది మెంటల్ కేసు అంటున్నారు కనుక, నష్టపరిహారాన్ని మొత్తం ఆ డిపార్ట్మెంట్ స్టోరుకి వెంటనే కట్టాలనీ, అతనికి పూర్తిగా బాగయేదాకా మెంటల్ కేర్ తీసుకోవాలనీ, తర్వాత కొన్ని

నెలలు జైల్లో వుండాలని దానితో పాటు కొంత ఫైన్ కూడా కోర్టుకి కట్టాలనీ తీర్పు వచ్చింది. నేను ఇంకా పూర్తి వివరాలు చూడాలి. కానీ ఇది చూశాక వాసు లాయరుకి మనతో బేరం పెట్టటానికి కొంచెం ఇష్టమవుతున్నది. మనం కోర్టుకి వెడితే, మనం అడిగినవన్నీ సాధించే అవకాశం వుంది. అతని మానసిక రుగ్మత వల్ల, నీ జీవితం, సుమ జీవితం, భవిష్యత్తు పెద్ద ప్రమాదంలో వుంటాయని వాదిస్తే, జడ్జి మనకి అనుకూలంగా వెంటనే విడాకులు ఇప్పించటమే కాకుండా, వాసుని సుమకి దూరంగా వుంచగలడు, వాసు ఆస్తులదృష్ట్యా నెలనెలా ఆలిమోనీ ఇప్పించగలడు. అందుకే వాసు లాయర్ ఇప్పుడు క్రిందికి దిగివచ్చి మనతో మళ్లీ మాట్లాడతాను అంటున్నాడు. ఇందాక నేను చెప్పినట్టు మనం కోర్టుకి వెళ్ళకుండానే ఇవన్నీ సాధించగలిగితే, నీకు మంచిది. ఏమంటావు రేఖా?" అడిగాడు కార్సన్.

"అలాగే చేద్దాం" అన్నది రేఖ.

ఆమె ముఖంలో ఆ ఆనందం కనిపిస్తూనేవుంది.

"ఎంత కష్టపడుతున్నదో నా బంగారం. ఇప్పుడీ కష్టాలు గట్టెక్కి ఆ రాక్షసుల బారినించీ బయటపడితే, ఇక రేఖ భవిష్యత్తుకి ఏ ఆటంకమూ వుండదు" మురళి మనసులో అనుకుంటూ, రేఖని దగ్గరకు తీసుకుని ఆమె నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు.

అందమైన రేఖ రెండు కళ్ళల్లోనూ రెండు నీటి బిందువులు ఎర్రగా మెరుస్తున్నాయి.

ఇంటికి వచ్చాక రాజేశ్వరికి ఆ శుభవార్త చెబితే, ఆవిడ రేఖకి దిష్టి తీసింది.

రేఖని కావలించుకుని ముద్దు పెట్టుకుంది.

సుమని హృదయానికి హత్తుకుని బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది.

ఎవరూ చూడకుండా పక్కకి తిరిగి, చెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంది.

మురళి అప్పటికప్పుడే వేణుకి ఫోన్ చేసి, స్పీకర్లో పెట్టి వేణుకి ఆరోజు లాయర్ కార్సన్ చెప్పిన మాటలన్నీ చెప్పాడు. రేఖ కూడా ఎంతో సంతోషంగా మాట్లాడింది.

వేణు కూడా వీణని పిలిచి, ఫోనుని స్పీకర్లో పెట్టి అంతా విన్నారు.

"రేఖా, నీకు కంగ్రాట్యులేషన్స్ నాన్నా" అన్నాడు వేణు.

"మాకు చాల సంతోషంగా వుంది రేఖా, నువ్వు అనుకున్నది సాధిస్తున్నావు. గ్రేట్!" అన్నది వీణ.

"అదంతా మీ సహాయం వల్లే. మీరిచ్చిన ధైర్యం వల్లే" అన్నది రాజేశ్వరి.

"నేను ఎల్లుండే ఇండియాకి వెళ్ళిపోతున్నాను. నేను వెళ్ళే లోపలే ఇది ఎంతోమంచి శుభవార్త. మా రేఖని మీ చేతుల్లో పెట్టి వెడుతున్నాను" అన్నాడు మురళి ఉద్విక్తంగా.

వేణు నవ్వుతూ అన్నాడు “మీరు చెప్పినదానికి ఒక చిన్న మార్పు చేద్దాం. నాకూ, వీణకీ ఇప్పుడు పెద్ద వయసొచ్చేస్తున్నది. మా అమ్మాయి సరళేమో ఎక్కడో వుంటున్నది. ఇక నన్నూ, వీణనూ కూడా రేఖ చేతుల్లో పెట్టి వెళ్ళండి. సుమతో పాటూ, మమ్మల్నీ చూసుకుంటుంది”

అందరూ ఇక్కడ నవ్వుతుంటే, రేఖ ఉయ్యాల్లో పడుకుని ఆడుకుంటున్న సుమతో అంటున్నది, “ఇవాళ మనకి ఎంతో మంచిరోజురా బంగారం. నాకేమో అన్నీ నేననుకున్నట్టు జరుగుతున్నాయి. నువ్వేమో నీ చిన్నిబొజ్జ నిండా పాలు తాగేసి, హాయిగా నవ్వుతూ ఆడుకుంటున్నావు. అంతకన్నా ఏం కావాలి” అని.

## 19

వేణు తన ఇంటి గ్రంధాలయంలోని పుస్తకాల్లో, తన అభిమాన రచయిత, ప్రముఖ సాహితీవేత్త ఆరుద్ర గారి పుస్తకాలు తిప్పుతున్నాడు.

అక్కడక్కడా ఆయన వ్రాసినవి మళ్ళీ మళ్ళీ చదువుతున్నాడు. చదువుతూ ఆ గొప్ప సాహిత్యాన్ని మనసారా ఆస్వాదిస్తూ, ఆనందిస్తున్నాడు.

అతనికి ఆరుద్రగారి సాహిత్యమంటే అంత ప్రేమ మరి!

అప్పుడే అక్కడికి వచ్చింది వీణ.

“ఏం చదువుతున్నారు?” అని అడుగుతూ.

“నా అభిమాన రచయిత ఆరుద్ర ఏమన్నారో చూడు. ‘నువ్వు ఎక్కవలసిన రైలు ఒక జీవిత కాలం లేటు’ అని. ఎంత గొప్ప భావన” అన్నాడు.

“ఆయన భావనా, మీ సంభావనా నాకు కొంచెం అర్థం అయేటట్లు చెప్పకూడదూ” అన్నది వీణ.

“కొందరి జీవితాల్లో తాము ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటుగా వస్తుందిట. బాగా చెప్పారు. వాళ్ళకి ఎక్కడికి వెళ్ళాలో తెలుసు, ఎలా వెళ్ళాలో తెలుసు. స్టేషనుకి కూడా వస్తారు. కానీ ఎక్కవలసిన ఆ రైలు మాత్రం వారి జీవితకాలంలో రాదు” అన్నాడు.

“అవును, కొన్ని అవాంతర సందర్భాల్లో వారి జీవితకాలంలో రాకపోవచ్చు. కానీ చాల సందర్భాల్లో, ఆ వచ్చిన రైలు తాము ఎక్కవలసినదే అయినా కూడా అది తెలుసుకోలేని వాళ్ళు కూడా వుంటారు. తమ కళ్ళ ఎదురుగానే అది వెళ్ళిపోతుంది. దానికి కారణాలు వారి ఆలోచనలు, వ్యక్తిత్వం, మానసిక పరిస్థితి, తెలివితేటలు.. ఇలా ఏదైనా కావచ్చు. మళ్ళీ తర్వత అటే వెళ్ళే రైలు వచ్చినా, దాన్ని కూడా గుర్తించలేక వదులుకోవటం కూడా జరగవచ్చు. ఇలాగే దీనికి ఎన్నడూ అంతు వుండకపోతే, వాళ్ళు ఎక్కవలసిన రైలు వారి జీవితకాలంలో రానట్టే లెఖ్ఖ కదా!” అన్నది వీణ.

“కొందరికి తెలిసీ, కొందరికి తెలియకా అలా చేయటం మనం చూస్తూనేవుంటాం. కాకపోతే ఎవరి జీవితగమ్యాన్ని వాళ్ళు ముందుగానే నిర్ణయించుకునే ఆలోచన వుంటేనేగదా, ఎక్కడికి వెళ్ళాలో అక్కడికి టిక్కెట్టు కొనుక్కోవటానికి” అన్నాడు వేణు.

“అవును మరి! గమ్యమే తెలియనప్పుడు ప్రయాణం ఎలా జరుగుతుంది!” అన్నది వీణ.

“ఇంకొక రకం వ్యక్తులు ఎలాటి వారంటే, మనం స్టేషన్లో రైళ్ళు ఎక్కేవాళ్ళని చూస్తుంటాం కదా. ఎక్కువ ఆలోచించకుండా హడావిడిగా రైలు ఎక్కేస్తుంటారు కొందరు. కానీ అది వాళ్ళు ఎక్కే రైలు కాకపోవచ్చు. అది తెలుసుకునే లోపలే, రైలు బయల్దేరి వేగం అందుకుంటుంది కూడా. అలా జరిగినప్పుడు ఏమీ గాభరా పడకుండా, తర్వత స్టేషన్లో ఆగినప్పుడు దిగి, తమ గమ్యం వేపు వెళ్ళే తమ ఎక్కవలసిన రైలు కోసం మళ్ళీ ఎదురు చూడాలి. కొంతమంది అదొక చెడ్డ శకునమనో, ఇంకేదో అనుకుని దాన్ని వదులుకుని  హాయిగా చేయవలసిన ప్రయాణం మానుకుని వెనక్కి రావటం కూడా చూస్తుంటాం. అలా కాకుండా ఎంతో ఇబ్బంది పెట్టినా, తాము వెళ్ళవలసిన చోటుకి వెళ్ళే ఒక రైలు వెళ్ళిపోయినా, కష్టనష్టాలు భరించి ఓపికగా తర్వాత వచ్చే అదే చోటుకి వెళ్ళే ఇంకొక ఎక్కవలసిన రైలు వచ్చాక, దానిలో వారి గమ్యానికి సంతోషంగా చేరుకునే వాళ్ళు మరికొందరు” అన్నాడు వేణు.

“అదే తెలివిగల వాళ్ళ లక్షణం.” అన్నది వీణ.

వేణు పెద్దగా నవ్వాడు.

“అదే ఆరుద్రగారు చెప్పిన మన జీవన రహస్యం. దాని గురించి నేను ఎప్పుడూ ఆలోచిస్తూనే వుంటాను. బోధ పడినట్టే వుంటుంది మరి!” అన్నాడు నవ్వుతూ.

“మీరు చెప్పినదే ఇంకొకరకంగా కూడా ఎక్కడో చదివాను. ‘Life is not a destination, it is only a jouney’ అని. అది నాకు లక్షరాలా నిజం అనిపించింది. మీరే మంటారు?” అడిగింది వీణ.

“ఏమంటాను, నువ్వేమంటే అదే అంటాను. కాదంటే ఇవాళ పస్తుండాలిగా మరి!” అన్నాడు వేణు నవ్వుతూ.

*(సమాప్తం)*

Post your comments